

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నల్గొండ
యాదాద్రి
సూర్యాపేట

మంగళవారం 13, మే 2025 పేజీలు - 8


## ఇందిరమ్మ ఇండ్ల పై...

- ఇందిరమ్మ ఇండ్ల పై సర్కార్ నిబంధన
- 600 చదరపు అడుగుల విస్తీర్ణం దాటితే కట్
- గందరగోళంగా నిర్మాణ కోలతలు
- అధికారుల ప్రకటనలతో లబ్ధిదారుల్లో కలవరం
- ఆన్‌లైన్‌లో ఆమోదించని వెబ్‌సైట్
- ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగేనా...?



# నీలి నీడలు

ఇందిరమ్మ ఇండ్ల పథకం పరిహాసంగా మారింది... లబ్ధిదారుల ఎంపిక నుంచి మొదలుపెడితే నిర్మాణం వరకు వివిధ దశల్లో ఎదురవుతున్న ఆటంకాలను గమనించి ముందుకు సాగే పరిస్థితి లేదు. ఓ వైపు పైలెట్ గ్రామాల్లో నేటికి ముగ్గు పోయని గ్రామాలు ఎన్నో ఉండగా రెండవ విడుతల్లో భాగంగా మిగతా గ్రామాలు లబ్ధిదారుల ఎంపిక వివాదస్పదంగా మారుతుంది. లబ్ధిదారుల ఎంపికలో గ్రామాల్లో కాంగ్రెస్ నేతలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఏర్పాటు చేసిన కమిటీల జోక్యం మితిమీరడంతో అనర్హులకు దక్కే అవకాశం లేకపోలేదు.

*నల్గొండ జిల్లా బ్యూరో*

వివరాలు 2లో

## అధికారులు రోడ్లను పట్టించుకోవాలి

గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండలంలో గ్రామీణ రోడ్లు కంకర తేలి అత్యంత అధ్వాన్నంగా తయారయ్యాయి. చామలోని బావి చండూరు, గుర్రంపోడు తేనేపల్లి, కొప్పోల్- నడికుడ రోడ్లు గుంతలమయమై రాకపో కలకు ప్రజలు అవస్తలు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్లను నిర్లక్ష్యం చేసి కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లన్నీ అస్తవ్య స్తంగా తయారై ప్రమాదాలకు నిలయంగా మారా యి. ప్రభుత్వం మారితే తమ రోడ్ల తలరాతలు మారుతాయని, రవాణా సమస్యలు తీరతాయని భావించిన మండల ప్రజలు ఆశలు ఆవిరయ్యాయ నివాపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా కనీసం మరమ్మతులు కూడా చేయక పోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం లాగే కాకుండా ఈ ప్రభుత్వమైనా స్పందించి మండలంలోని గ్రామీణ రోడ్లకు టెండర్లు పిలిచి ప్రయాణానికి ఇబ్బంది లేకుండా రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## బుద్ధ వనాన్ని సందర్శించిన 22 ఆసియా దేశాల సుందరీమణుల బృందం

### స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్





*ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో*

తెలంగాణ రాజధాని హైద్రాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీ మణుల పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22 మంది సుందరీమణుల బృందం సోమవారం నల్గొండ జిల్లా బుద్ధ వనాన్ని సందర్శించింది. ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయ విహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జునసాగర్ తీరాన ఉన్న విజయ విహార్‌లో ఫోటోలు దిగారు. అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహా స్థూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానంలో పాల్గొన్నారు. మహాస్థూపం వద్ద ప్రపంచ సుందరీమణులకు లంబాడా కళాకారులు లంబాడా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం ప్రాముఖ్యత,బుద్ధుడి జననం నుండి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం జాతకవనంలో బుద్ధ చరితం పై కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్ రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, ఎంఎల్‌సి శంకర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ బుద్ధవనం, నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను, తెలంగాణ గొప్పతనాన్ని వివరించారు. ఐఏఎస్ అధికారి లక్ష్మి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఏఎస్‌పిలు రమేష్, మౌనిక, ఆర్‌డివోలు, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

# స్వరాజ సూక్త సాహిత్య సామూహిక యజ్ఞం



భువనగిరి, మేజర్‌న్యూస్ : భువనగిరి పట్టణంలోని వన ప్రస్థానంలో మాజీ డిఎస్పి శ్రీమతి నలిని ఆధ్వర్యంలో సూక్త సహిత సామూహిక యజ్ఞం నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా, యజ్ఞం భారత్ పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అలుపు పెరగని పోరాటం చేస్తున్న వివిధ దళాలకు ఈ యుద్ధానికి నాయకత్వం వహిస్తున్న మన దేశ ప్రధాని నరేంద్ర మోడీకి విజయ ప్రాప్తి కోరుతూ స్వరాజ్య సూక్త సాహిత్య సామూహిక యజ్ఞాన్ని ప్రారంభించామని తెలియజేశారు. అదేవిధంగా దేశ ప్రధాని చెప్పినట్టుగానే పిఓకెని భారత్‌కి అప్పగించాలని అదేవిధంగా ఉగ్రవాదులు అంతం చేయాలని లక్ష్యంగా కంకణం కట్టుకున్న నరేంద్ర మోడీకి మన వంతు సహాయం ఉండాలని ప్రతి ఒక్కరూ దేశ భవిష్యత్తు కోసం ఆలోచన చేయాలని అని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, జిల్లా నాయకులు గూడూరు సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా దొనకొండ సత్యనారాయణ, కొంగరి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి వైజయంతి, ఎం.డి.మహమూద్, కొల్లోజు సతీష్, ఆశ్రమ నిర్వాహకులు రామారావు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సమ్మె విరమణ

భువనగిరి, మేజర్‌న్యూస్ : తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ గత 40 రోజులుగా చేపట్టిన పరీక్షల బహిష్కరణ సమ్మెను విరమించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ శ్రీ బాలకిష్టా రెడ్డి డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, వెంటనే పరిష్కరించవలసిందిగా కోరగా ముఖ్యమంత్రి సుముఖంగా స్పందించి డిగ్రీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేస్తామని గట్టి హామీ ఇవ్వడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ శ్రీ బాలకిష్టా రెడ్డి అన్ని యూనివర్సిటీల, రాష్ట్ర కమిటీలతో మాట్లాడి స్వయంగా చైర్మన్ బాధ్యత తీసుకుని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించినట్లు, అన్ని విశ్వవిద్యాలయల పరిధిలో పరీక్షలు ప్రారంభిస్తామని ప్రకటించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల జాప్యం వల్ల ప్రైవేట్ కళాశాలలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి, వెంటనే తగు చర్యలు తీసుకోవడానికి ఉన్నత విద్యా మండలి చైర్మన్ శ్రీ బాలకిష్టా రెడ్డి ద్వారా ప్రయత్నం చేసినందుకు ప్రభుత్వానికి మరియు ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డికి ధన్యవాదాలు తెలియజేసింది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని, విద్యార్థుల పట్ల బాధ్యతతో సమ్మెను విరమించాలని, భవన యజమానులు, అధ్యాపకులు సహృదయంతో కళాశాలల యాజమాన్యాలకి సహకరించాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి కోరారు. నిధులు మంజూరు చేయించే బాధ్యత నాదేనని చైర్మన్ తెలిపారు. గత ఆరు నెలలుగా డిగ్రీ కళాశాలల ఫీజు రియంబర్స్మెంట్ విషయంలో అలుపెరుగని కృషితో నిరంతరం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయించుటలో సఫలీకృతులు అవుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డికి తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలియ చేసినారు.




# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నూతనకల్, మేజర్‌న్యూస్ : తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన కొమ్ము పరమేష్, లింగంపల్లి గ్రామానికి చెందిన మహబూబా లకు చెక్కులను అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పుల పాపయ్య, అనంతల శ్రీను, కారింగుల యాకసాయులు, రాచకొండ అయోధ్య, సజ్జన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్కెట్ చైర్మన్



నూతనకల్, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని సోమ్లా తండా ఆవాస గ్రామం జాల్ తండాకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ వినోద్ తమ్ముడు గుగులోతు విజయ్, సరస్వతిల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి సోమవారం ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సోమ్లా తండా గ్రామ శాఖ అధ్యక్షులు గుగులోతు రాజు నాయక్,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్, నాయకులు బాలాజీ నాయక్, గుగులోతు రమేష్ నాయక్, రవి నాయక్, తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు మూడ్ మోహన్ నాయక్, రవి, విజయ్, బొల్క సైదులు యాదవ్,ముత్యం మహేష్, మరికంటి అశోక్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల పై...


# నీలి నీడలు

***నల్గొండ జిల్లా బ్యూరో***

ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రహసనంగా మారింది. నిజంగా సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా రాజకీయ కోణంలో వారికి జాబితాలో చోటు దక్కడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలి దశ జాబితా ఎంపికలో క్షేత్ర స్థాయి నుండి అందుతున్న సమాచారం ప్రకారం మెజార్టీ లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండడం గమనార్హం. దాంతో కొన్ని చోట్ల నిజమైన లబ్ధిదారులు గ్రామాల్లోని అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల రోడ్డు పైకి వచ్చి ఇండ్లజాబితా పై నిరసనలకు దిగుతున్నారు. సరైన రీతిలో పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో సమస్య మరింత జఠిలంగా మారుతుంది. కొన్ని గ్రామాల్లో పేదలకు ఇచ్చినప్పటికీ వారు బెస్‌మెంట్ నిర్మాణం కూడా చేసుకోలేకపోతున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పిన దానికి నేడు క్షేత్రస్థాయి పరిస్థితులకు అసలు పొంతన లేదు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు మరో 3 పథకాలను జనవరి 26 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆ తరువాత మండలానికి ఒక పైలేట్ గ్రామానికే పరిమితం చేసిన విషయం తెలిసిందే. ఆ గ్రామాల్లో ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లు పథకం అమలు కొనసాగుతుంది. గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్యకు ఆ తరువాత సర్వే చేసి ఫైనల్ చేసిన సంఖ్యకు పొంతన లేదు. మంజూరు పత్రాలు అందుకున్న వారిలోనూ సగానికి సగం లబ్ధిదారులను కుదించి వేశారు. కొందరు స్థానికంగా ఉండడం లేదని, మరికొందరికి ట్రాక్టర్లు, కార్లు, ట్యాక్సీలు వంటివి నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని పక్కకు పెట్టారు. ఇంటి స్థలం నిబంధనల ప్రకారం లేదనే కారణంతోను లబ్ధిదారులను తగ్గించారు. దాంతో ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గిపోతుంది. అందులోను ఇప్పటికి మెజార్టీ సంఖ్యలో ఇండ్ల నిర్మాణమే మొదలు పెట్టలేదు. కనీసం మార్కింగ్ కూడా పలు గ్రామాల్లో చేయలేదు. ఇక బెస్‌మెంట్ వరకు పూర్తిచేసిన వారినైతే వేలమీద లెక్కపెట్టొచ్చు. వారిలోనూ సగం మందికి కూడా తొలివిడుత లక్ష రూపాయల సహాయం అందలేదు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కొలతల్లో గందరగోళం నెలకొంది. 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా 600 చదరపు అడుగుల విస్తీర్ణానికి ఎక్కువ కాకుండా నిర్మాణం ఉండాలని తాజా నిబంధన అనేక సమస్యలకు దారి తీస్తుంది. భూములు ప్రభుత్వం చెప్పిన విధంగా లేవని జిల్లాలోని పలు మండలాల్లో లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రారంభంలో లబ్ధిదారులకు అందజేసిన ప్రొసిడింగ్‌లో ఇంటి నిర్మాణం విస్తీర్ణం పై ఇచ్చిన నిబంధనలకు ప్రస్తుతం కొత్తగా చెప్తున్న దానికి పొంతన లేకపోవడంతో ఉన్న కొంతమంది లబ్ధిదారులు అర్ధాంతరంగా అనర్హులుగా మారుతున్నారు. డబ్బులు లేని సమయంలో ప్రభుత్వం ఇస్తుందన్న ఆశతో ఇళ్లు మొదలు పెడితే తరువాత పరిస్థితి ఏలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. తొలి విడుత జాబితాలో కాంగ్రెస్ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. మంత్రిని, ఎమ్మెల్యేలను సైతం గ్రామస్థాయి నేతలు ప్రభావితం చేస్తుండడంతో నిజమైన అర్హుల ఎంపిక పై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇలా ఉంటే ఇందిరమ్మ ఇండ్ల పథకం ముందుకు సాగేనా అని విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి.

# నీది ఎస్సీ కులం నాకు వద్దు

## ప్రేమించి చట్ట ప్రకారం పెళ్లి చేసుకొని అవమానిస్తున్న యువకుడు



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : నువ్వే నా సర్వస్వం అంటూ ప్రేమించాడు... తన ఇష్టంతో రిజిస్టార్ కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్నాడు. ఇప్పుడు నువ్వు ఎస్సీ కులానికి చెందిన దానివి నాకు వద్దు అంటూ, అవమానిస్తున్న యువకుడిలోని వివక్షత తీరు. గత్యంతరం లేని పరిస్థితిలో యువతి సోమవారం జిల్లా కలెక్టర్‌కు, ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. వివరాల్లోకి వెళితే యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన యువతి, ఎనమల్ల ఇందిరా ప్రియదర్శిని తాను చదువుకుంటున్న రోజుల నుంచి మిత్రుడు, యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామానికి చెందిన, జీడిమడ్ల మహేందర్ రెడ్డి తామిద్దరం ఇష్టపడి, హైదరాబాద్ ఉప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 14 అక్టోబర్ 2022లో చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రెండున్నర సంవత్సరాలకు పైగా కలిసి కాపురం చేసినట్లు తెలిపారు. అమ్మాయి ప్రైవేట్ కార్పొరేట్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తూ, అబ్బాయి వ్యాపారం అంటూ రెండు సంవత్సరాలకు పైబడి సాఫీగా కాపురం చేశారు. ఇంతలో నువ్వు ఎస్సీ కులానికి చెందిన దానవు నాకు వద్దు అంటూ అమ్మాయిని వేధించడం మొదలుపెట్టాడు. ఆ క్రమంలో హైదరాబాదులో పనిచేసుకుంటూ కాపురం చేస్తున్న, కులాంతర వివాహిత జంట తమ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, పెద్దల సమక్షంలో రెండు మార్లు పంచాయతీ పెట్టారు. అయినప్పటికీ తక్కువ కులం అనే మాటలో మార్పు రాలేదు. నాకు వద్దు మీది ఎస్సీ కులం అంటూ పెద్ద మనుషుల ముందు కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేశాడు. అబ్బాయి ఇంటి ముందు వెళ్లి న్యాయం కై పోరాటం చేయాలని అనుకుంటున్న క్రమంలో ఫోన్ చేసి మా ఇంటి ముందుకు వస్తే నేను ఆత్మహత్య చేసుకుంటాను అని బ్లాక్ మెయిల్ బెదిరింపులకు పాల్పడుతున్నాడు అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో తనకు న్యాయం చేయమంటూ సోమవారం కలెక్టర్‌ను వేడుకున్నారు.

# లారీ ఢీకొని వృద్ధుడి మృతి



మిర్యాలగూడటౌన్, మేజర్‌న్యూస్ ః లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమ వారం మండలంలోని తుంగపహడ్ గ్రామంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం త్రిపురారం మండలంలోని కంపాలపల్లి గ్రామానికి చెందిన నాగెల్లి రాములు (80) అనే వ్యక్తి చెన్నయిపాలెం గ్రామంలోని తన మనవరాలు ఇంటికి వెళ్లడం కోసం తుంగపాడు గ్రామంలో ఆటోదిగి రోడ్డు దాటుతుండగా హలియా వైపు నుండి మిర్యాలగూడ వస్తున్న ఏపీ 07 టిహెచ్ 5769 అను నెంబర్ గల లారీ అతివేగంతో రాములును ఢీకొనడంతో రాములు తలకు, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయని చుట్టు పక్కల వారు అతడిని 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా చనిపోయాడని, మృతుని కుమారుడు నాగెల్లి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

# సివై-టిబి పరీక్ష ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహణ





యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో ట్యూబర్‌కులోసిస్ నిర్ధారణ కోసం అత్యాధునిక సివై-టిబి పరీక్షను ప్రారంభించే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.సాయి శోభ పిఓ టిబి హాజరై, టెస్ట్‌ను అధికారికంగా ప్రారంభించారు. సివై-టిబి పరీక్ష ద్వారా టిబి వ్యాధిని మరింత శీఘ్రంగా, ఖచ్చితంగా గుర్తించడం సాధ్యమవుతుందని వైద్య నిపుణులు తెలియజేశారు. ఈ టెస్ట్‌ను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకు రావడమే తమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా డా॥ సాయి శోభ మాట్లాడుతూ టిబి నిర్మూలన దిశగా ఇది ఒక మైలురాయి అన్నారు. సివై-టిబి పరీక్ష ప్రజారోగ్య రంగానికి మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కొత్త టెస్ట్ ద్వారా తక్కువ సమయంలో, మెరుగైన ఫలితాలను అందించడం వల్ల, టిబి నివారణలో ఇది కీలక పాత్ర పోషించనుందని నిపుణులు అభిప్రాయ పడ్డారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## కొలిశెట్టి యాదగిరిరావు

తుంగతుర్తి మేజర్ న్యూస్ ః ఈ నెల 20వ తేదిన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. సోమవారం సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం తుంగతుర్తి మండల కేంద్రంలో కందాల శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ




సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలో అన్ని ప్రాంతాల్లో ఈ నెల 20వ తేదీన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున రాయితీలను పేద మధ్య తరగతి వర్గాలకు అనేక రకాలైన భారాలను మోపుతూ వారి బతుకులను బజారున పడే విధంగా నిర్ణయాలను తీసుకుంటుందని విమర్శించారు. దేశంలో ఉన్న అన్ని ట్రేడ్ యూనియన్ రైతు సంఘం కార్మిక సంఘం ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20వ తేదిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతున్నందున అన్ని వర్గాల ప్రజలు మేధావులు ఉద్యోగ సంఘాలు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాసు, పులుసు సత్యం, మండల కార్యదర్శి వద్దే శ్రీనివాస్, పోలోజు సైదులు, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరితో పాటు పళ్ల సుదర్శన్, జనార్ధన్, వీరయ్య పాల్గొన్నారు.

# వైభవంగా వెంకటాపురం నరసింహ స్వామి కల్యాణం



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వెంకటాపురం నరసింహ స్వామి కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. కల్యాణాన్ని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం తరుపున పట్టు వస్త్రాలు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి సమర్పించారు. స్వామి వారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అన్నదాన వితరణ చేశారు. ఈ వేడుకలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, వెంకటాపురం మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు రమాకాంత్ శర్మ కళ్యాణంలో పాల్గొన్నారు.పలువురు ప్రముఖులు కల్యాణానికి హాజరయ్యారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రంను సందర్శించిన అధికారులు



మోత్కూర్, మేజర్‌న్యూస్ : మండలంలోని దాచారం గ్రామంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశానుసారం సోమవారం మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆకస్మికంగా సందర్శించారు. మండల వ్యవసాయ అధికారి కీర్తి, ఏఈఓ ఎం.అశోక్, జిల్లా న్యాయ సేవాధికారా సంస్థ పారా లీగల్ ప్రతిని ధులు కురిమేటి యాదయ్య, ఇటికాల లింగయ్య తూకాల(క్వాంట) పని తీరును, రైతుల పంట కొనుగోలు రశీదులు, ట్రక్ షీట్ బుక్‌లను పరిశీలించారు. అక్కడ మార్కెట్‌లో రైతులు నష్టపోతున్న తీరును గమనించి వారికి తెలియచేశారు. అనంతరం రైతులకి అవగాహన కల్పించినట్లు వారు తెలిపారు. దాచారం వివో ప్రతినిధి లక్ష్మి, రైతులు నోముల మల్లేష్, అండెం ప్రతాప్ రెడ్డి, మేడబోయిన యాదమ్మ, కప్పల రేణుక తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌యస్ నాయకుల అబద్ధపు మాటలు

## - కొప్పుల జైపాల్ రెడ్డి



మునగాల, మేజర్‌న్యూస్ : దయ్యాలు వేదాలు వళ్ళించినట్లుగా ఉన్నది, అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి సోమవారం ఒక కార్యక్రమంలో అన్నారు. బిఆర్‌యస్, నాయకుల మాటలు, గత పది ఏండ్ల బిఆర్‌యస్, ప్రభుత్వంలో, ఒక్క ఇల్లు కూడా ఇవ్వని నాయకులు, ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా, దశల వారిగా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి, పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుంది. రాష్ట్ర మంత్రివర్యులు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు పద్మావతిరెడ్డి, సహకారంతో మునగాల మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచటంలో ముందున్నారు. బిఆర్‌యస్ నాయకుల అవాకులు, చవాకులు పేలితే ఊరుకునే ప్రసక్తే లేదు.అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయం మార్కెట్ డైరెక్టర్ కాసర్ల కోటయ్య, గ్రామ అధ్యక్షులు వీధరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలు ఏం కోరుకుంటున్నారో కమ్యూనిస్టులు గ్రహించాలి

## - రాష్ట్ర ప్రెస్ అకాడమి అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి




హుజూర్‌న గర్‌రూరల్, మేజర్‌న్యూస్ ః ప్రజలు ఏం కోరుకుంటున్నారో ప్రజల ప్రయోజనాలకు ఏం కావాలో దేశ ప్రయోజనాలకు ఏం కావాలో కమ్యూనిస్టులు గ్రహించి వివరించడంలో వెనుకబడవద్దని రాష్ట్ర ప్రెస్ అకాడమి అధ్యక్షడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీలో ఉన్న నాయకులైన భావజాలాన్ని అందించించి కమ్యూనిస్టులేనన్న విషయం మరువరాదన్నారు. కమ్యూనిస్టులు ప్రమాదకర పరిస్థితులను ప్రజలకు చెప్పడంలో ముందుండాలన్నారు.ప్రంచ చరిత్రలో అమెరికా ఏ యుద్ధంలో ఇప్పటి వరకు గెలవలేదని కేవలం వ్యాపారం కోసమే యుద్ధాలు చేస్తుందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడింది కమ్యూనిస్టులేనని ఈ పోరాటం చేయని ఆర్ఎస్ఎస్ దేశభక్తి అంటే తామేనని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, అక్కినేని వనజ, భాగం హేమంతరావు, జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి రజని, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, రైతాంగ పోరాట నాయకుడు దొడ్డా నారాయణరావు,రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన, రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి విజయలక్ష్మీ, గంగాభవాని,యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు,ప్రేమ్‌పావని, అమీనా, సదాలక్ష్మీ,జ్యోతి పాల్గొన్నారు.

# దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసమే సిపిఐ నిరంతర పోరాటాలు

## పార్టీకి ఉద్యమాల ద్వారానే గుర్తింపు

## వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ

## టెర్రరిజాన్ని అంతమొందించాలి

## సిపిఐ చండూరు మండలం 15వ మహాసభలో

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి

చండూరు, మేజర్‌న్యూస్ : నిరంతరం ప్రజల పక్షాన నిలబడి దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసమే భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, పల్లా వెంకట్రెడ్డి అన్నారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ మండల 15వ మహాసభ మండల పరిధిలోని ధోనిపాముల గ్రామంలో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు. మహాసభకు ముందు పార్టీ అరుణ పతాకాన్ని ఎమ్మెల్సీ సత్యం ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద అమరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో పళ్ళ వెంకట్రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు కావస్తున్న పేద ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు నేను కలిగించే విధానాలకు పాల్పడుతున్నారని అన్నారు. దేశంలోని జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం చారకరమన్నారు. ప్రపంచ దేశాలు శాంతియుతంగా ఉండాలంటే టెర్రరిజాన్ని అంతమొందించాలని అన్నారు. టెర్రరిజాన్ని అంతమొందించడానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వారి మద్దతు ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్ ఎక్కువ కేటాయించడం, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు నిధులు తక్కువ కేటాయించడం, వెనక బడిన రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం సరైనా పద్ధతి కాదని అన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. ఉద్యమాల ద్వారానే పార్టీకి మంచి గుర్తింపు వస్తుందని, ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చండూర్ మండలంలో సి పిఐకి ఎంతో బలం ఉందని ఎన్నో పోరాటాలు ఉద్యమాలు, ఉద్యమాలు నిర్వహించి అనేక త్యాగాలు చేసిన పార్టీగా మంచి మంచి గుర్తింపు ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయుటకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ సహాయ కార్యదర్శి లియాదయ్య బొడ్డు వెంకటేశ్వర్లు మాధగోని విజయలక్ష్మి, బరిగెల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లినలపరాజు రామలింగయ్య, సిపిఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్, మండల కార్యవర్గ సభ్యులు తిప్పర్తి రాములు, బరిగల వెంకటేష్ దోటి వెంకన్న, బండ మీది వెంకటేశం, సిహెచ్ ఉషయ్య, రమేష్ గంట, ఇరిగి సంజీవ, బోయపల్లి బిక్షమయ్య జంగయ్య, సత్తయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి వివాహ వేడుకలు

చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి వివాహ వార్షికోత్సవం మండల ప్రజల ఆధ్వర్యంలో వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చింతపల్లి మండలంలో మచ్చలేని వ్యక్తిత్వం గల నాయకులు కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డిని అన్నారు. నిండు నూరేళ్ళ పాటు ఆయురారోగ్యాలతో పాటు ప్రజా సేవలో కొనసాగాలని కోరుకుంటున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పూల యాదయ్య, సిమర్ల శ్రీను యాదవ్, ఉడుత శంకర్ యాదవ్, ఉడుత శ్రీను యాదవ్, మాచర్ల. శ్రీశైలం, పి.కే.మల్లేపల్లి అమర్నాథ్, మహేందర్, రమేష్, పోల అశోక్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణ గిరిలో స్వామివారికి విశిష్ట కల్యాణ మహోత్సవం



భువనగిరి, మేజర్‌న్యూస్ : ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సువర్ణభరిత వజ్రాభరణాలతో, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి విశిష్ట కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణమహోత్సవాన్ని తిలకిస్తూ దివ్యానుభూతిని పొందారు.

# ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షులు విక్రమ్ రావు హఠాన్మరణం

## – సంతాపం తెలియజేసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ



భువనగిరి, మేజర్‌న్యూస్ : ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జాతీయ అధ్యక్షుడు కోటంరాజు విక్రమ్ రావు హఠాన్మరణం చెందారని తెలియజేయుటకు చింతిస్తున్నాను. సోమవారం ఉదయం లక్నోలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన వయసు 82 సంవత్సరాలు. విక్రమ్ రావు తెలుగు వారు. చాలా కాలంగా ఢిల్లీ, లక్నోల్లో వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా, ఎడిటర్ గా పనిచేసిన ఆయన ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో స్థిరపడ్డారు. జర్నలిస్టుల హక్కుల కోసం ఆయన దాదాపు నాలుగు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఆయన దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. 1984 నుంచి ఆరు సార్లు ఐఎఫ్ డబ్ల్యూజే కు అధ్యక్షుడుగా ఉన్నారు. ప్రస్తుతం ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడుగా కొనసాగుతున్న విక్రమ్ రావు సమాజంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై అనేక రచనలు చేశారు. నలభై ఏళ్లలో దాదాపు 200లకు పైగా పుస్తకాలు రాశారు. విక్రమ్ రావు మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజే ఎఫ్) జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలియజేస్తుంది. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఐఎఫ్ డబ్ల్యూజేకు అనుబంధంగా పని చేస్తుందని, విక్రమ్ రావుతో తమకు 18 ఏండ్లకు పైగా అనుబంధం ఉందని ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యులు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొలుపుల వివేకానంద అధ్యక్ష కార్యదర్శులు పేరబోయిన నరసింహ ముత్యాల జలంధర్ తెలిపారు. విక్రమ్ రావు మరణం జర్నలిస్టుల ఉద్యమానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# వేల్పుల నాగయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

## మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

నూతనకల్, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేల్పుల నాగయ్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి సోమవారం పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దరిపల్లి వీరన్న,అనంతుల శ్రీను, గుణగంటి వెంకన్న,గోరుగంటి రామచంద్రరావు,సామ సుధాకర్ రెడ్డి,



మెంచు లింగమల్లు,కొమ్ము పరమేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్,నాయకులు కాశ శంకర్, వేల్పుల రఘు,బొల్క సైదులు, ముత్యం మహేష్,మరికంటి అశోక్,కాస రవి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో మహిళల అక్షరాస్యత పెంచాలి

## – అదనపు కలెక్టర్ వీరారెడ్డి



భువనగిరి, మేజర్‌న్యూస్ : నిరక్షరాస్యులు అందర్నీ అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. జిల్లా వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలో మహిళల అక్షరాస్యత కూడా పెరగాలన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక పరంగా కృషి చేయాలన్నారు. ముందుగా ట్యూటర్లను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. తద్వారా జిల్లా స్థాయిలోనూ మండల స్థాయిలోనూ గ్రామస్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేసి ట్యూటర్ల చే శిక్షణ ఇప్పించాలని అంచలంచలుగా నిరక్షరాస్యతను రూపుమాపాలని తెలియజేశారు. జిల్లాలో సుమారు 99 వేల మంది నిరక్షరాస్యులు ఉన్నట్టు నివేదిక ఉన్నందున 21 వేల మంది అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలన్నారు. ఉల్లాస్ యాప్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని ఎన్ఐసిపి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, వయోజన విద్య ఉపసంచాలకులు మమత, విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఉల్లాస్ జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, రెడ్ క్రాస్ సభ్యులు బాలాజీ, డిపిఎంలు పాల్గొన్నారు.

# శివాలయంలో స్పటిక లింగానికి పూజలు



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో సోమవారం వేకువ జామున సుప్రభాతంతో మొదలై నిత్యారాధనలతోపాటు ప్రత్యేక అర్చనలు చేపట్టా రు. ఆర్జిత సేవ రాత్రి ప్రతిష్ట మూర్తులకు ఆరాధన సహస్రనామార్చన నిర్వహిం చారు. అనుబంధంగా కొనసాగుతున్న మందిరంలో రామలింగేశ్వరుని కొలుస్తూ అభిషేకం అర్చనలు, రుద్రహోమం నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో లక్ష్మీ నరసింహ స్వామిని ఆరాధిస్తూ నిత్య ఆరాధనతో పాటు కళ్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు అర్చన రాత్రి ఎనిమిది గంటల పదిహేను నిమిషాలకు దర్శనాలు ప్రారంభం 9 గంటలకు ఆగింపు అనగా నివేదన తదుపరి ద్వారబంధన.

# సీఎం సహాయనిధి చెక్కు అందజేత



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని రత్తిపల్లి గ్రామానికి చెందిన కోట్ల వసుమతి భర్త ఉమారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురి అయి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు.మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.35,500/- రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రత్తిపల్లి మాజీ సర్పంచ్ మాధగోని రాజేష్ గౌడ్, గాదె బిక్షమయ్య, గాదె నరసింహ, శ్రీను, యాదయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎరుకల నాంచారమ్మ జాతర



భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని పిల్లాయిపల్లి గ్రామంలో సోమవారము ఎరుకల నాంచారమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలు, డప్పుల వాయిద్యాలతో వారికి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం అధ్యక్షులు కుతాడికుమార్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం కుర్రు రాష్ట్ర అధ్యక్షులు కూతాడి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు కూతాటి భాస్కర్, ఇంచార్జ్ తాసిల్దార్ నాగేశ్వరరావు, ఎస్సై భాస్కర్ రెడ్డి, నాయకులు డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ అందాల హరీష్, మాజీ ఎంపీటీసీ బందారపు సుమలత లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భూషణం గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు సదానందం గౌడ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్, నాయకుల తోట బాబు, కూతాడి మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15న గిరిజన ఇంటర్ విద్యార్థులకు కౌన్సిలింగ్



దామరచర్ల, మేజర్‌న్యూస్ : పదో తరగతి పాస్ అయిన గిరిజన విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.లక్ష్మయ్య తెలిపారు. దామరచర్ల మండలంలో తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల బాయ్స్‌కు ఈ విద్యా సంవత్సరంలో ఎంఇసి 40 సీట్లు, సిఇసి 40 సీట్లుగ్రూపులలో ప్రవేశానికి ఈ నెల 15న మిర్యాలగూడలోని అవంతిపురం గురుకుల ప్రతిభ కళాశాలలో ఉదయం 11 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించబడునని తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు సంబంధిత అన్ని ధ్రువీకరణ పత్రములతో కౌన్సిలింగ్‌కి హాజరు కాగలరని తెలిపారు.

# ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

### - మండల వ్యవసాయాధికారి ఏస్.పద్మజ

### - ఎరువుల దుకాణాల డీలర్లతో ప్రత్యేక సమావేశం

### - విత్తనాలు ఎరువులు పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి



మునుగోడు, మేజర్‌న్యూస్ : విత్తనాలు, ఎరువులు,పురుగు మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ఏస్.పద్మజ ఎరువుల దుకాణాల డీలర్లకు తెలిపారు. సోమవారం మండలం కేంద్రంలోని రైతు వేదికలో ఎరువుల దుకాణాల డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయించినట్లు మా దృష్టికి వస్తె దుకాణాలను సైతం సీజ్ చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల అమ్మకపు వివరాలను రికార్డుల్లో ప్రతిరోజు పొందుపరచాలని సూచించారు. పత్తి విత్తనాలను ఎమ్మార్పీ ధర రూ 901/-, వ్యవసాయ అధికారి ఫోన్ నెంబర్‌తో ఫ్లెక్సీలను ఏర్పాటు ప్రతి ఎరువుల దుకాణాల ముందు ఉంచాలని సూచించారు. రైతులకు బిల్లు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు ఎవరైన విక్రయం చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని, నకిలీ విత్తనాలు కొని రైతులను మోసపోవద్దని లైసెన్స్ వున్న దుకాణాల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి, బిల్లులను పంట కాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్త చూసుకోవాలని రైతులకు సూచించారు. విత్తన, ఎరువుల మరియు పురుగు మందుల చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మండల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పండుగ వాతావరణం

### కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి

నల్గొండ (రామన్నపేట), మేజర్‌న్యూస్ : ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుందని, గ్రామ ప్రజలపై మల్లన్న స్వామి, గంగా భవాని దీవెనలు ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజి రెడ్డి అన్నారు. మండలంలోని పల్లివాడ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ గంగాభవాని మల్లన్న కళ్యాణ మహొూత్సవ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల రాజి రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరలు ఉత్సవాలు తెలుగు సంస్కృతి ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు ప్రజలంతా ఐక్యమత్యంగా కలిసి ఉంటారన్నారు. ఆ మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



# టెర్రరిస్టులను మట్టుబెట్టాలి

### - మతాన్ని హింసకు వాడుకోవడం అటవీక సాంప్రదాయం

### - ఉగ్రవాదానికి శాశ్వత పరిష్కారం చూపాలి

### - సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



హుజూర్‌నగర్‌రూరల్, మేజర్‌న్యూస్ : ప్రపంచంలో ఏ దేశంలోనైన టెర్రరిస్టులను మట్టపెట్టాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని సిపిఐ సీనియర్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధ రైతాంగ వీరనారి కామ్రేడ్ పశ్య కన్నమ్మ సంతాప సభలో ఆయన మాట్లాడారు.కాశ్మీర్‌లో అమాయకులను చంపి అందులో కొత్తగా పెళ్లయిన జంటలోని నేవీ ఆఫీసర్‌ను చంపడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. చరిత్రలో కన్నెకంటి కన్నీరు ఎక్కడా వృథాగా పోలేదని, ఇప్పుడు కూడా ఉగ్రవాదాన్ని లేకుండా చేసేందుకు ఆకన్నీరు కారణమవుతుందన్నారు. టెర్రరిస్టులు ఇప్పటి వరకు ఎప్పుడైనా ఆకస్మీకంగా కాల్పులు జరపడం వెళ్లిపోవడమే చూశామని మొదటిసారి మత ప్రాతిపదికన చంపడం జరిగిందన్నారు. దేశంలో ఎన్నికలు జరిగినప్పుడే టెర్రరిస్టులు దాడులు జరపడం అమాయకులు బలికావడం దానిని బిజెపి పార్టీ వాడుకోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. అమెరికా ఒకవైపు పాకిస్థాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగిస్తూనే టెర్రరిస్టు యాక్టివీటిస్‌ను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించడం జరుగుతుందన్నారు.టెర్రరిస్టులను అంతం వందివంచడం కోసం ప్రపంచ దేశాలన్ని కలసి శాశ్వత పరిష్కారం వెతకాలన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న ముస్లింలందరూ టెర్రరిస్టులు కాదని అక్కడ కూడా టె ర్రరిజాన్ని వ్యతిరేకించే సామాన్యమైన ప్రజలు ఉన్నారని గుర్తు పెట్టుకోవాలన్నారు. పాకిస్థాన్‌లోని టెర్రరిస్టులను అంతమొందించాలని, కానీ సామాన్య ప్రజలను కాదన్నారు.తీవ్రవాద సమస్యకు కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేయడం బిజెపి ప్రభుత్వానికి ఇష్టం లేనట్లుందని ఆయన విమర్శించారు. మతాన్ని, టెర్రరిజాన్ని ఎన్నికల లబ్ధికోసం ఉపయోగించుకోవడం అటవీక సాంప్రదాయని అది కొంత మంది నాయకుల శాడిస్ట్ మెంటాలిటీని తెలియజేస్తుందన్నారు.సిపిఐ,ఆర్ఎస్ఎస్ రెండు ఓకే సంవత్సరం ఆవిర్భవించిన దేశం కోసం పోరాడిన చరిత్ర నిజమైన దేశభక్తి కమ్యూనిస్టులదే అన్నారు. దేశరక్షణ,ప్రజా ప్రయోజనాల రక్షణకు సిపిఐ పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు.

# ఆర్మీ సైనికులకు లక్షరూపాయలు అందజేసిన బీర్ల శివమణి

యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : ఆర్మీ సైనికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుమారుడు బీర్ల శివమణి లక్ష రూపాయలు సహాయం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సమక్షంలో అందజేశారు. చిన్నప్పటి నుండి తన కిడ్డి బ్యాంక్‌లో దాచుకున్న లక్ష రూపాయలు తన తల్లి బీర్ల అనితతో కలసి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. దీంతో కలెక్టర్ కార్యాలయంలో ఉన్న అధికారులు, అందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్న తనంలోనే ఇంతటి సేవ గుణం బీర్ల శివమణికి ఉండటంతో కలెక్టర్ హనుమంత రావు శాలువా కప్పి అభినందలు తెలిపారు.



# కన్నుల పండుగగా తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం



హుజూర్‌నగర్‌రూరల్,మేజర్‌న్యూస్‌ః పట్టణంలోని దద్దనాల చె రువులో ఆతుకూరి వెంకటప్పయ్య పొలంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారికి కళ్యాణ మహోత్సవం ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది. అర్చకులు ఆతుకూరి సందీప్, గోపి అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. పలువురు భక్తులు మాట్లాడుతూ మొక్కితే వరాలిచ్చే తల్లి గోపయ్య సమేత తిరుపతమ్మ తల్లి అని కొనియాడారు. కార్యక్రమంలో చావా ప్రసాద్, జక్కుల శంభయ్య,ప్రసాద్, జక్కుల లింగయ్య, రాజమల్లు, తండు శ్రీను, ఆతుకూరి మల్లయ్య, ఆతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.

# బహిరంగ సభను విజయవంతం చేయాలి



నేరేడుచర్ల,మేజర్‌న్యూస్‌ః ఈ నెల 21వ తేదీన సూర్యాపేటలో అమరుడు కామ్రేడ్ జన్ను బాయ్ నాల్గవ వర్ధంతి సందర్భంగా జరిగే విగ్రహావిష్కరణ, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ హుజూర్‌నగర్ డివిజన్ కార్యదర్శి వాసా పల్లయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఉత్తమ్ పద్మావతినగర్‌లో మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో జన్నుబాయ్ వర్ధంతి సంబంధించిన గోడప్రతికను ఆయన పలువురు నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ జన్నుబాయ్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విప్లవోద్యమ నిర్మాణానికి తీవ్రంగా కృషిచేసి, నాలుగు సంవత్సరాల క్రితం కరోనా మహమ్మారితో అమరుడైనాడన్నారు. జన్నుబాయ్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాస కరుణాకర్, రజాక్, లక్ష్మి, పావని, ఫాతిమా, నాగేంద్ర, సత్యక్క, లక్ష్మమ్మ,అలివేలు,మరియమ్మ, సుజాత, సైదులు, రాములు, దేవయ్య, షకీర్ పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి

నేరేడుచర్ల,మేజర్‌న్యూస్‌ః స్థానిక లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పదకవితా పితామహుడు అన్నమయ్య జయంతి, బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని విద్యార్థులకుసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ చైర్ పర్సన్ బట్టు మధు, జోన్ చైర్ పర్సన్ చల్లా ప్రభాకర్‌రెడ్డిలు హాజరై మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు సామాన్యుల మనసుకు హత్తుకునేలా ఉండే వినూత్నత కలిగి ఉండటం విశేషమన్నారు. సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ వారు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు




జిలకర్ర రామస్వామి,గుండ్రెడ్డి సైదిరెడ్డి,షేక్ యూసూఫ్, గుండా సత్యనారాయణ ,సూరిబాబు,చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, అడ్వకేట్ విశ్వనాథం, తక్కెళ్లపల్లి నాగార్జున, ఉపాధ్యాయులు యాదగిరి, నగేష్, నాగమణి,బాలు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మిర్యాలగూడటౌన్,మేజర్‌న్యూస్‌ః పెద్దఅడిశర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005-2006 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం పట్టణంలోని శరత్‌చంద్ర గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి హెచ్‌ఎం కత్తుల శంకర్,పూర్వ ఉపాధ్యాయులు బుచ్చయ్య, శేఖర్‌రెడ్డి, శ్రీదర్,సంజీవ్‌రావు నర్సయ్య,మున్నా,సూర్య,లోక్య, అజ్గర్ కాతున్, వెంకటమ్మ, రవి,లకపతి హాజరై ప్రసంగించారు. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలను కప్పి జ్ఞాపిక లను అందచేసి ఘనంగా సన్మానించారు. పహల్గామ్‌లో మరణించిన టూరిస్టలకు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆర్కపల్లి సత్యనారాయణ, చల్ల సైదులు,అంజి,ఉపేందర్,రాజు, మహేందర్, రాకేష్, గౌతమ్, అలివేలు, అనిత,సరిత,స్వాతి, శ్రీలత, నలీమా,ధనమ్మ,సైదమ్మ పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం కీలకం

## సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్



నాగారం మేజర్ న్యూస్ ః గంజాయి, డ్రగ్స్ మాదక ద్రవ్యాల దుష్పావాలను తెలియజేసి వాటి వినియోగాన్ని అరికట్టడానికి తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆధ్వర్యంలో నాగారం మండంలఫణిగిరి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కళాజాత సమావేశంలో గంజాయి, డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని ఇటువంటి రుగ్మతలను రూపుమాపేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని మాదక ద్రవ్యాల వినియోగం వలన సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని అందుకే దేశ భవిష్యత్తును కుంగదీసే మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టాలని మాదక ద్రవ్యాలు వినియోగిస్తే ఎన్పిడిఎస్ యాక్టులో పేరు నమోదైతే సొసైటీలో ఉనికి కోల్పోతారని సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరేలా కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఒట్టే సురేష్, సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, పోతరాజు శీరిష, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు కుటుంబానికి ఆర్థిక చేయూత

## - ఎస్పీ నరసింహ



మునగాల, మేజర్‌న్యూస్ : సూర్యాపేట జిల్లా కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు పని చేస్తున్న మునగాలవాసి కానిస్టేబుల్ రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగినది. దివంగత పోలీసు సిబ్బంది కుటుంబాల అవసరాలు తీర్చడం లో భాగంగా పోలీసు చేయూత పథకం ద్వారా కానిస్టేబుల్ రాంబాబు కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల పోలీసు చేయూత పథకం చెక్కును ఎస్పీ నరసింహ ఐపిఎస్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాంబాబు కుటుంబ సభ్యులకు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుంది. రాంబాబు కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని ఎస్పి తెలిపినారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బంది ప్రతి నెల జీతం నుండి విరాళం అందిస్తున్నారు అని అభినందించారు, పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు అన్నారు.
ఈ కార్యక్రమం నందు, అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, వెల్ఫేర్ సాయిరాం, కుటుంబ సభ్యులు కిరణ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఇదేనా సుపరిపాలన ?

నడిగూడెం, మేజర్‌న్యూస్ ః ఏలినవారి లీలలు రోజురోజుకీ వింత గొల్పుతున్నాయి. సుపరిపాలనకు తమను తామే ఓ నమూనాగా ప్రచారం చేసుకునేవాళ్లు, అవినీతి అక్రమాలకు ఆమడదూరమని ప్రకటించుకునేవాళ్లు, క్రమశిక్షణకు నిబద్ధతకు మారుపేర్లమని నీతులు బోధించేవాళ్లు ఏపాటి పనిమంతులో ఆచరణలో పదేపదే రుజువవుతున్నది. వీరి విధానాల ఫలితంగా దగాపడిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించండి మొర్రో అంటూ వీధుల్లోకొచ్చి పోరాడుతుంటే విధులు మరిచిన నేతలు వింత వింత విన్యాసాలు చేస్తూ ప్రజలను, ప్రజా ఉద్యమాలను అపహాస్యం చేస్తున్నారు. దేశవ్యాపితంగా రైతాంగం ఆకలి చావులతో, ఆత్మహత్యలతో అల్లాడుతుంటే నేతలు యోగాసనాలు వేసుకోండి అంటూ సూక్తులు వల్లిస్తున్నారు. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలు రైతుల ఆగ్రహజ్వాలలతో మండుతుంటే అర్థంలేని దీక్షలు చేస్తూ నీరో చక్రవర్తులను తలపిస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి వినోదాల్లో తేలియాడుతున్నారు.
బీజేపీ పాలనలో దళితులు, ముస్లింలే కాదు, ఇప్పుడు రైతులు కూడా దేశ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతున్నారు. అటు బీజేపీ గానీ, ఇటు టీఆర్ఎస్ గానీ స్వాభిమానంతో బతికే రైతును ప్రభుత్వాల సహాయం మీద ఆధారపడే స్థితికి దిగజార్చి వ్యవసాయాన్ని సంక్షోభంలో కొనసాగిస్తున్నాయి. ఓట్లు అవసరమైనప్పుడు రుణమాఫీ లంటున్నాయి. అవసరం తీరాక ఆ ఊసే మరిచిపోతున్నాయి. అంతెందుకు మన రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా అధికారం కోసం ఇద్దరు చంద్రులు రుణమాఫీలు ప్రకటించారు. కానీ అధికారం చేపట్టి మూడేండ్లు ముగుస్తున్నా ఆ రుణమాఫీ ఇంకా సాగుతూ...నే ఉంది..! అప్పట్లో దీనిని వ్యతిరేకించిన ప్రధాని నరేంద్రమోడీ ఉత్తర్రపదేశ్‌లో అధికారం కోసం ఇదే రుణమాఫీని ప్రజలకు వాగ్దానం చేశారు..!! ఇప్పుడేమో "రుణమాఫీ ఒక ఫ్యాషన్ అయిపోయింది' అంటూ వెంకయ్యనాయుడు హేళన చేస్తున్నారు. ఇదంతా ఏరుదాటి తెప్ప తగలేసిన చందంగా ఉంది. ఫలితంగా ఈ దేశంలో ప్రభుత్వాల విధానాల వలన దగాపడుతున్న ప్రజానీకంలో రైతులు ముందు వరుసలోకి వస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అయితే ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది.
నేడు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్రపదేశ్‌లలో ఏం జరుగుతున్నది..? బీజేపీకి ఘనవిజయాలను అందించిన ప్రజలే వారి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగుతున్నారెందుకు..?

# కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

## సిఐటియు జిల్లా కోశాధికారి కోటగిరి వెంకట్ నారాయణ



కోదాడ, మేజర్‌న్యూస్ : కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎన్ఎంఆర్ పిక్స్డ్ తదితర పద్ధతిలో పనిచేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనాన్ని 26 వేల రూపాయలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కోటగిరి వెంకట్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ రమాదేవికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్మికులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ నారాయణ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, శాశ్వతమైన కార్మికులను నియమించాలని, భారత రాజ్యాంగం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టు చెబుతున్నప్పటికీ ఏ ఒక్కటీ అమలుకు నోచుకోవటం లేదని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని మున్సిపాలిటీలో 8 గంటల పని దినాలను అమలు చేయకుండా కార్మికులతో 12 గంటలపాటు పనిచేస్తున్నారని ఇది సరైన ది కాదని, 8 గంటల పని దినాలను అమలు చేయాలని మున్సిపల్ కార్మికులు మరణిస్తే దహన ఖర్చులు నిమిత్తం 30 వేల రూపాయలు ఇవ్వాలని, వయసు పైబడి అనారోగ్యానికి గురై చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని, మున్సిపల్ కార్మికులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇల్లు, ఇళ్ల స్థలాలు కేటాయించి పెరుగుతున్న పట్టణ విస్తరణకు అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని వారు అన్నారు. మున్సిపాలిటీలో పెండింగ్లో ఉన్న మార్చి నెల వేతనం పెండింగులో ఉన్న రెండు సంవత్సరాల బట్టల కుట్టు కూలి చెప్పులు, తోపాటు తదితర డిమాండ్స్ పరిష్కారం చేయాలని లేనట్లయితే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోదాడ సిఐటియు పట్టణ కార్యదర్శి మిట్ట గనుపుల ముత్యాలు, యూనియన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, నాగమణి, ధనమ్మ, గోపి, రామారావు, లక్ష్మణ్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్నూకర్ క్రీడా పోటీలు ప్రారంభం

## కోదాడలో స్నూకర్ క్రీడ పోటీలు ప్రారంభించిన జానీ బాయ్



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడలో స్నూకర్ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని కోదాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహబూబ్ జానీ అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీనివాస థియేటర్ ఎదురుగా గల మదర్ స్నూకర్ గేమింగ్ హబ్ నందు క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు ఐక్యమత్యాన్ని స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, ఒత్తిడి నుంచి బయటపడేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ అన లిస్టు హరీష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంటి పులి వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు పెండెం వెంకటేశ్వర్లు, స్వామి నాయక్, మదర్, యూసఫ్, బలేమియా, స్నూకర్ ప్లేయర్లు పాల్గొన్నారు.

# ఘనంగా బాల నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం





చిట్యాల, మేజర్‌న్యూస్ : చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ బాల నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ అర్చకత్వంలో హోమం, గరుడ ముద్ద, ఆలయ ప్రదర్శన నిర్వహించి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వంద సంవత్సరాలుగా ఉన్న ఈ దేవాలయాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని, దేవాలయం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, బాల నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ ఇమ్మడి వెంకటేశ్వర్లు, కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్ ఆంజనేయులు గౌడ్, దేవస్థానం కమిటీ డైరెక్టర్లు బెలిదే నర్మద సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జడల చిన్న మల్లయ్య యాదవ్, కాటం వెంకటేశం, వనమా వెంకటేశ్వర్లు, పందిరి శ్రీనివాసులు, బెల్లి సత్తయ్య, బొబ్బలి శివశంకర్ రెడ్డి, గంజి వెంకటేశం, ఏర్పుల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాన్ని నిక్కచ్చిగా ధైర్యంగా చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉంది

## – సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



హుజూర్‌నగర్‌రూరల్, మేజర్‌న్యూస్ ః నిజాన్ని నిక్కచ్చిగా ధైర్యంగా చెప్పే సత్తా కమ్యూనిస్టులకే ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అసలైన కమ్యూనిస్టులు తప్పును తప్పుగా ఒప్పును ఒప్పుగా చెప్తారన్నారు. కమ్యూనిస్టులు భావజాలం ప్రకారం ఎక్కడ వెనుకబడి లేరని నిర్ణయాక పాత్రలో ఉన్న విషయం అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులు మద్దతు ఉన్న పక్షమే అధికారం చేజిక్కించుకోవడం దీనికి నిదర్శనమన్నారు. ఎన్నికలలో డబ్బులు ఖర్చు పెట్టడంలో కమ్యూనిస్టులు వెనుకబడి ఉన్న మాట వాస్తవమేనని డబ్బులే ఖర్చు పెడితే కమ్యూనిస్టులే గెలుస్తారని ఆయన అన్నారు. దేశంలో ప్రజల ఎమోషన్స్‌ను రాజకీయాలకు వాడుతున్నారన్నారు. మనిషికి ఆలకి ఉన్నంతకాలం ఉద్యమాలు ఉంటాయయని ఉద్యమాలు ఉన్నంత కాలం కమ్యూనిస్టులు ఉంటారన్నారు. ప్రజల పట్ల సమాజం పట్ల అంకితభావం ఎర్రజెండాకే సాధ్యమన్నారు.

# విరాళం దాతలకు సన్మానం



వలిగొండ, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని అరూరు గ్రామంలో కట్ట మైసమ్మ బొడ్రాయి శ్రీ చెన్నకేశ్వర స్వామి పండుగల సందర్భంగా గ్రామానికి చెందిన ప్రముఖులు పారిశ్రామికవేత్తలు విరాళాల అందజేసిన సందర్భంగా సోమవారం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సీ.ఎన్.రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతలకు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఉద్దేశంతో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విరాళాలు అందజేసిన దాతలు వివిధ పార్టీల నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చెన్నకేశ్వర స్వామిని దర్శించుకున్న మురళీధర్ రెడ్డి మానస దంపతులు



వలిగొండ, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని అరూరు గ్రామంలో కొలువైన శ్రీ భూనీళా గోదా సమేత చెన్నకేశవ స్వామిని సోమవారం బిజెపి రాష్ట్ర నాయకులు తుమ్మల మురళీధర్ రెడ్డి మానస వారి కుమారులు రితీష్ రెడ్డి నితీష్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీ చెన్నకేశవ స్వామి దర్శించుకుంటే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని అంతేకాకుండా శ్రీ చెన్నకేశ్వర స్వామి చాలా మహిమగల దేవుడని అన్నారు.

# నిరాశ్రయులకు జన యేత్రి ఫౌండేషన్ కుటుంబ సభ్యుల చేయూత



మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ ః చెయ్యి చెయ్యి కలుపుదాం నిరాశ్రయులకు చేయూతనిద్దాం అన్న నినాదంతో ఎల్లప్పుడు జనయేత్రీ కుటుంబ సభ్యులందరూ ఏకమై ఒకే ఒక వాట్సప్ మెసెజ్‌తో నిరుపేద కుటుంబాలకు దుస్తులను సేకరించి సుమారు 15 బస్తాలకు పైగా నిరాశ్రయ కుటుంబాల వారందరికి మదర్స్ డే సందర్భంగా జనయేత్రి కుటుంబ సభ్యులందరూ కలిసి హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న నిరాశ్రయులకు సోమవారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, పోగుల సందీప్, అమీర్‌అలీ, సాహమిర్,రఫీ,ఆవిరెండ్ల సందీప్, రాజు, అనిల్, సాయినాథ్, రజాక్, సత్యం, కార్తీక్, రాజేష్, జరీనా, తన్వీర్, సన, సోఫియా, రేహాన్, అంజుమ్ పాల్గొన్నారు.